


# జాలిలేని జాబిలి

## – కొమ్మూరి వేణుగోపాలరావు



తనకు కావలసింది వెదుక్కుంటూ ముందుకుపోవడమే మానవుని జీవితం. కాని తనకు కావలసిందేమిటోకూడా తెలియని అస్పష్టస్థితి.

రచయిత కావాలనుకున్నాడు - అయినాడు. డాక్టరు కావాలనుకున్నాడు - అయినాడు. పేరు ప్రఖ్యాతులు కావాలనుకున్నాడు - లభించినై.

కానీ అతనికి యేదో కావాలి. అతన్నెంతోమంది ఆరాధించారు. జీవితంలోకి ఎందరో సుందరీమణులు ప్రవేశించారు. అతని చుట్టూ ప్రేమ హృదయంలో ప్రేమ. కాని ఆ ప్రేమ అతన్ని స్పర్శించేదేగాని అదృష్టవంతుడ్ని చేయలేదు.

యవనం వుంది - డబ్బు వుంది - కీర్తి వుంది - అంతా వున్నారు కాని...?

అతనిపట్ల జాబిలికి జాలిలేదు.

*కొమ్మూరి రవికిరణ్ గారి ప్రత్యేక అనుమతితో*
*అలనాటి అందమైన నవల పునర్ముద్రణ*

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**ఎంత బాగా** కనుక్కున్నాడు తన గురించి అతను. తనకు తెలీని ఎన్నో విషయాలు అతనికి తెలుసు. తనకంటే ఒక ఏడాది పెద్ద. అంతే. అతని కథలు తన వాటికన్నా బాగుండవు. అతని సాహిత్యం కన్నా అతను గొప్ప. తనకన్నా తన సాహిత్యం గొప్ప. ఇంతకీ అతని ఆశయమేమిటో.

"మీ ఆశయం ఏమిటి మరి?" అన్నాడు.

ఉమాపతి మందహాసం చేశాడు. "ఈ రోజుల్లో ఎవర్ని కదిపినా సెక్స్, ప్రేమ, స్త్రీ వీటిని గురించే కాన్‌సెన్‌ట్రేట్ చేస్తున్నారు. వీటిల్లో నిజం కన్నా ఆర్భాటం ఎక్కువ. నిజాయితీకన్న శిల్పం ఎక్కువ. ఇంతా చూస్తే తెలుగుతనం ఉండదు. తెలిసినవాళ్ళూ, తెలియని వాళ్ళూ పతితుల్ని గురించీ, దొంగల్ని గురించీ రాయటం చెరిగేస్తున్నానని భుజాలెగరేయటం ఫ్యాషన్ అయిపోయింది. ఏదో ఒక సంఘటన చూసి, అది తాము కొత్తగా కనిపెట్టామన్న ధీమాతో రాసేటంతటి అసహన స్థితికి వచ్చారు. విషయం పాతదే అయినా, నాకు వీటినుంచి ఒక రిలీఫ్ ఇవ్వాలనిపించింది. మన చుట్టూ వ్యాపించివున్న సామాన్యమైన నిజంలోంచి ప్లాట్ ఎన్నుకోవాలి. అతీతంగా రాస్తేనే ఉత్తమ రచన అన్న భ్రమ తొలగించాలి. అట్టహాసం, ఆడంబరం, పాండిత్య ప్రకర్ష ఉండకూడదు. నేను మధ్యతరగతి కుటుంబంలో పుట్టాను. వారి సాధకబాధకాలు, స్థితిగతులు క్షుణ్ణంగా తెలుసుకున్నాను. అనుభవించాను, ఉదాహరణకి "పొదుపు" అన్నది ఓ సమస్య. ఈ పొదుపు, దుబారాల గురించి చక్కని నవల రాయొచ్చు. వంకరటికర డైలాగులూ, జీవితంలో సెక్స్ సమస్య అనుకొనటం నా రచనల్లో ఉండదు. కుటుంబ జీవితాలని యధాతధంగా, మృదువుగా కొంచె మెరుగుపెట్టి చిత్రించడమే నా ఆశయం" అన్నాడు.

అతని పద్ధతి మధుబాబుని ఆకర్షించింది. నిజంగా ఓ రిలీఫ్ ఇవ్వగల ఆత్మ విశ్వాసం కనబడుతోంది అతన్లో. తనని గురించి తాను చక్కగా ఓ దారి ఎట్లా యేర్పాటు చేసుకున్నాడో.

ఏడున్నర అయేసరికి వాళ్ళింక వెళతామని లేచారు. తరుచూ వస్తూండమని మధుబాబు మనఃపూర్వకంగా కోరాడు. అన్నదమ్ములిద్దరూ సెలవు తీసుకుని బయటకు నడిచారు.

మధుబాబు గుమ్మంలో నిల్చుని చూడసాగాడు. ఓ పదిగజాలు పోయాక ఇద్దరూ సిగరెట్లు వెలిగించుకుని ఏవో కబుర్లు చెప్పుకుంటూ నడిచి పోసాగరు. అతనికి నవ్వు వచ్చింది.

"ఎవర్రా? కొత్తవాళ్ళలాగా కనిపిస్తున్నారే" అంది తల్లి అన్నం వడ్డిస్తూ.

"అవునమ్మా. ఇవాళే స్నేహమైంది. అందులో ఒకతను రచయిత" అన్నడు మధుబాబు ఉత్సాహంగా.

ఆ రాత్రి అతని కెంతకీ నిద్రపట్టలేదు. తనకోసం ఓ రచయిత వెదుక్కుంటూ రావటం, తనలోని ప్రత్యేకతని బాయ్టుపెట్టటం ముదావహంగానే ఉంది. కాని అతను తనకేమీ ఆశయంలేదని తనతోనే వొప్పించిపోయాడు. ఎట్లా వస్తుంది తనకది? ఏం చెయ్యాలి? ఇలా ఇష్టం వచ్చినట్టు దేన్నిపడితే దాన్ని గురించి రాయటం ప్రగతికి ప్రతిబంధకమా? స్త్రీని గురించి తీసుకుంటే? తనకేమీ తెలీదు వాళ్ళగురించి. నిరుపేదలు, దరిద్రం. గుమాస్తా, కళాకారుడు, కులమత తారతమ్యాలు, ఓ రాజకీయ సిద్ధాంతం వీటిల్లో దేన్నో ఒకదాన్నే తన పథకంగా నిర్దేశించుకోవాలా? దాన్ని గురించే

ప్రత్యేకంగా పుస్తకాలు చదివి అనేక విషయాలు గ్రహించి, వాటిని గురించి తర్జన భర్జనలు జరుపుతూ వుండాలా? ఎలా లభిస్తుంది తనకు ఆశయం? తన ముద్ర, ప్రజలమీద వేసే ఆ మంత్రం ఏమిటి?

ఎంత తన్నుకున్నా అతని ఆలోచనలకు ఓ ఫలితం ఏర్పడలేదు. విసిగిపోయాడు. ఎలాగో నిద్రపట్టింది.

6

ఇంటర్మీడియట్ మొదటి యేడు పూర్తయింది. సెలవుల్లో మధుబాబుకు కావలిసినంత తీరిక. చదవాలన్న ఉత్కంఠకూడా బాగా పెరిగింది. ఇంగ్లీషు క్లాసిక్సూ, షేక్స్పియర్ నాటకాలూ చదవటం ప్రారంభించాడు. అభిరుచి లేకపోయినా అవసరం క్రింద చేసుకుని తెలుగు పద్యకావ్యాలూ, ప్రబంధాలూ చదవసాగాడు. అతనికి ఛందస్సు రాదు. అయినా కొన్ని గేయాలు రాశాడు. వాటిలో కొన్ని ప్రముఖ వారపత్రికల్లో అచ్చయినై కూడా. కాని యీ కావ్యాలు అతనికి సరిగ్గా వంటబట్టేవి కావు. సగంసగం అర్థమయ్యేవి. కఠినమైన పదం ఒకటి తటస్థపడినప్పుడల్లా దాన్ని మననం చేసుకుని హృదయ సీమలో పదిలం చేసుకునేవాడు. కాని చదువుతోంటే సరిగ్గా ఏకాగ్రత కుదిరేది కాదు. ఊహలమీద ఊహలు పొర్లుకుంటూ వచ్చేవి. ఆవి కాగితం మీదకు ఎక్కించేవరకూ చేతులు దురదలు పుట్టేవి.

క్రమంగా అతని బంధువులలో అందరికీ అతను రచయితగా ఆదర్శప్రాత్రుడు కాసాగాడు. అతని మేనమామలూ, వరుసకు అన్న అయినవాళ్ళూ అభినందిస్తూ ఉత్తరాలు రాసేవాళ్ళు. "మధూ నీ కథలు బాగుంటున్నాయి. చక్కని సైకాలజీ ద్యోతకమౌతోంది. ఏ మనిషిని కూడా నిర్లక్ష్యం చేసి చూడకు. ప్రతివారినుంచీ ఏరుకుంటే కావలసినంత సామాగ్రి లభిస్తుంది. ముఖాలు పరిశీలించి అంతఃకరణలు గ్రహించటం నేర్చుకో" అని ఓ మేనమామ రాశాడు.

ఉమాపతి తరుచు కలుస్తున్నాడు. అయితే మధుబాబు మునుపటిలాగా మాటాడలేని వాజ కాదు. అతనిప్పుడు కొన్నికొన్ని అభిప్రాయాలు వ్యక్తం చేయగలడు. తనకు ఓ మార్గం లేదే అన్న చింత అంతగా ఇప్పుడు లేదు. రాసిన ప్రతిదాన్ని గురించీ ఓ ప్రయోజనం సిద్ధింపజేసి చెప్పగలడు. అతనికిలా చెప్పగలటం సాధన మీద వచ్చింది. కథ రాసే ముందు కాకపోయినా, రాశాకయినా యిందులో ఏం ఉందా అని ఆలోచిస్తున్నాడు. అందులోంచి ఓ ముత్యాలసరం బయటకు తీస్తున్నాడు. ఒక అంశాన్ని గురించి వాదోపవాదాలు వచ్చినప్పుడు అవతలివాడ్ని ఎదురించి తట్టుకునేంతటి శక్తిరాకపోయినా తన పాయింటు మీద పెనుగులాడగలడు.

అయితే ఒక్క లోపం మాత్రం అతన్ని విడిచిపోలేదు. తనకు ఏది అత్యంత ప్రీతిపాత్రమైన వస్తువో అతనింకా గ్రహించలేదు. ఓ గదిలో పలురకాల జంత్రాలు మ్రోగుతున్నాయనుకోండి అన్నీ కదలిక కలిగించేవే. ప్రత్యేకంగా "ఇది

నన్ను బాగా కదిలించింది" అని చెప్పలేని స్థితి. తనకు నచ్చిన అన్ని పదాలలోనూ పాంథుడిగా నడిచి ప్రయోగాత్మకంగా అనుభవిస్తున్నాడు.

అన్నట్లు అతను ఎన్నాళ్ళనుంచో కోరినకోరిక సఫలమయింది. మొదటిసారిగా అతని కథ భారతిలో అచ్చయింది. ఉమాపతి రచనలింతవరకూ అచ్చుకాలేదు. బహుశా ఇంత చిన్న వయస్సులో భారతిలో కథ రాసిన వాళ్ళెవరూ లేరేమో. అతనికి గర్వం కలిగింది. తాను పైకి పోతున్నాడు.

వేసవి సెలవులు గడిచి, కాలేజి తెరిచారు, మధుబాబు రెండో ఏటిలో ప్రవేశించాడు. కొన్నాళ్ళకు యధావిధిగా ఎలక్షన్‌లు జరిగాయి. కాలేజి మేగజైన్ పోటీ పరీక్ష జరిగింది. అతను మళ్ళీ పాల్గొన్నాడు. అంశము "ఇంగ్లీషులో విద్యాభ్యాసం సమజసమా" అతను ఆలోచించి శక్తికొద్దీ బాగా రాశాడు. దాని తర్వాత ఇంటర్వ్యూకి కొంతమందిని సెలక్ట్ చేసి పిలిచారు. వాళ్ళలో మధుబాబుకూడా ఉన్నాడు. తర్వాత ఫలితాలు తెలిశాయి. అతను సెలక్ట్ అయ్యాడు.

"హమ్మయ్య" అనుకున్నాడు. తను అనుకున్నది నెరవేరింది. మంచి మేగజైన్ తీసుకురావాలి. ఇదివరకు ఎవరూ తీసుకురానట్లుగా కొత్త కొత్త ఆకర్షణలతో తయారు చెయ్యాలి.

భారతిలో అతని కథ అచ్చుకావటం చుట్టూ మంచి వాతావరణాన్ని సృష్టించింది. "అందులో ఏముంది చెత్త?" అని కొంతమంది ప్రబుద్ధులు అన్నా, కొంతమంది విద్యార్థులు దగ్గరకు వచ్చి అభినందించసాగారు. కొన్నాళ్ళలో మరి రెండు మూడు కథలు కూడా భారతిలో అచ్చయినాయి. నిజానికి అవి చాలా మంచి కథలు. ఎంతోమంది హృదయాలను కదిపాయి. మధుబాబు దాకా రాలేదుకాని మిగతా రచయితలలో చైతన్యవంతమైన చర్చలకు కారణభూతమైంది .అందులో ఒకకథలో చనిపోయేముందు ఆ విషయం తెలిసి తపన పడ్డ ఒకడి మనస్తత్వం హృదయ విదారకంగా చిత్రింపబడింది. అది అచ్చయినాకనే రేడియోవాళ్ళ దగ్గర్నుంచి నాటిక రాయమని ఆహ్వానం వచ్చింది. మధుబాబు పులకితుడయాడు. ఇదివరకు రేడియోకు ఎన్ని నాటికలు పంపినా తిరిగి వచ్చాయి. రెండు రోజులు కష్టపడి పదిహేను నిమిషాలకు సరిపోయే ఒక నాటిక రాసి పంపాడు.

కాలేజీలో ఓ మహాకవి వున్నాడు. ఆయనంటే మధుబాబుకు చాలా భక్తిశ్రద్ధలు. మహాకవి నిజంగా గొప్పవాడు. సాహిత్య సామ్రాజ్యంలో ఆయన స్పృశించని విభాగంలేదు. గొప్ప వక్తకూడా. కానీ పెడసరం మనిషి. మనసు మృదువయినదేగాని, మాట కఠినంగా వుంటుంది. దేశమంతా ఆయనకు బోలెడంత శిష్యబృందముంది. ఆయనంటే గిట్టనివాళ్ళూ సమయం వస్తే పరాభవిద్దామని కాచుకు కూర్చున్నవాళ్ళూ అనేకులు వున్నారు. అయితే ఆయనముందు ఆ పప్పులేవీ వుడకవు. ఎంతటివాడినైనా ఎటువంటి పరిస్థితిలోనయినా చీమని దులిపి పారేసినట్లు దులిపేస్తాడు.

ఆయన వ్యక్తిత్వం చాలా గొప్పది. ఏం రాసినా, ఏం చెప్పినా పరిపూర్ణమైన విశ్వాసంతో, మరో ఇరవయ్యేళ్ళ తర్వాతనైనా అదేమాట చెప్పగలిగే స్థయిర్యంతో చెబుతాడు. ఆయనతో ఎట్లాగైనా పరిచయం కలిగించుకోవాలని మధుబాబు ఉవ్విళ్ళూరుతున్నాడు. ఆయన తన క్లాసుకిరాడు. అందుకని తన గురువుగా సంబంధం వుంచుకునే అవకాశం అతనికి కలగలేదు. ఓ రోజు ధైర్యం చేసి ఆయన ఇంటికి వెళ్ళాడు. ఆదివారం ఉదయం తొమ్మిది అవుతుంది. పడక్కుర్చీలో కూర్చుని మహాకవి ఏదో గ్రంధం పఠిస్తున్నాడు.

"నమస్కారమండీ" అన్నాడు మధుబాబు వొణికే కంఠంతో.

మహాకవి తలెత్తి "ఎవర్రా అబ్బాయి? నాస్టూడెంటువా?" అని ప్రశ్నించాడు.

మధుబాబు తడుముకుని "కానండీ, నేను ఫస్టియిర్ చదివే రోజులలో మీరు సెకండియర్‌కి వెళ్ళేవారు. ఇప్పుడు నేను సెకండియర్‌కి వచ్చేసరికి మీరు ఫస్టియర్‌కి వెడుతున్నారు. మీరు మాకు రావటం లేదు" అన్నాడు.

"మీకా అదృష్టం లేదురా" అన్నాడు మహాకవి.

కొంచెం ఆగి ఆయనే "ఏం చెయ్యనురా అబ్బాయి? మీ క్లాసే తీసుకుందామనుకున్నానుగాని ఆరోగ్యం బాగుండటంలేదు. ఫస్టియర్ వాళ్లకయితే ఎక్కువ శ్రమ తీసుకోనక్కరలేదని వాళ్ళకి వెళుతున్నాను" అన్నాడు.

మధుబాబు జవాబు చెప్పకుండా నిలబడ్డాడు.

"అన్నట్లు ఎందుకొచ్చావు? నీ పేరేమిటి? ఆ కుర్చీ ఇలా లాక్కుని కూర్చో."

అతను కుర్చీ దగ్గరకు లాక్కుని కూర్చుని, తన పేరు చెప్పి "సాహిత్యమంటే అభిలాష వుందండీ" అన్నాడు.

ఆయన చిత్రంగా కళ్ళెగరవేసి "ఏమిటి? నీకూ ఆ పైత్యం వుందన్నమాట" అన్నాడు.

మధుబాబుకు నవ్వొచ్చింది. "కథలు రాస్తుంటానండీ" అన్నాడు మెల్లగా.

"అచ్చయినాయా?"

బల్లమీద కాళ్ళు బారజాచిన శాస్త్రిగారు "నువ్వు కథ పంపితే ఎన్నాళ్ళలో వేసుకుంటారు?" అని అడిగాడు.

మధుబాబు తలవూపి ఈ మధ్యనే భారతిలో అచ్చయిన కథపేరు చెప్పాడు.

మహాకవి ముఖంలో రవంత ఆశ్చర్యం పొడసూపింది. గుర్తు తెచ్చుకుంటున్నట్లుగా "ఏమిటి? అది నేను చదివినట్లున్నానే ఉందు" అని లేచి అల్మారా దగ్గరకు వెళ్ళి ఆ నెల భారతి తీసుకొచ్చి ఓ పేజీ తీసి "ఇదేకదూ" అన్నాడు.

మధుబాబు ఉత్సాహంగా "అవునండీ" అన్నాడు.

ఆయన మళ్ళీ కుర్చీలో కూర్చుని పేజీలు త్రిప్పుతూ "నేను చదివానురా అబ్బాయి ఇది. కథకూడా గుర్తుంది. నేను నేటి నవీన సాహిత్యం చదవనని అంతా అనుకుంటారు. అది అబద్ధం. కొత్తవాళ్ళు రాసేది చాలావరకూ చదువుతూనే వున్నాను. నీ కథ నాకు నచ్చింది. నీకు మంచి అభివృద్ధి ఉంది. పైకి వస్తావు. అవునుగాని ఇంత పెసిమిస్టుగా ఎందుకు తయారయ్యావురా?" అన్నాడు.

మధుబాబు నీళ్ళు నములుతూ "నేను అట్లాగే..." అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు.

"పెసిమిజం ఈనాటి ఫ్యాషన్ అయిందిలే. అట్లా రాస్తేనేగాని పేరు రాదు కూడా. నీకు శిల్పం ఇంకా అమరలేదు. పద్యాలు రాయటం వచ్చునా?"

"రాదండీ."

"బ్రతికించావు. నువ్వు ఎన్నటికీ కవివి అవటానికి ప్రయత్నించకు. పైకి రావటం సులభమే కాని, రెండు కావ్యాలు రాసేసరికి కలం ఇంకిపోతుంది. అప్పుడు నీకు గతమేకాని భవిష్యత్ వుండదు"

కొంచెం ఆగాక మధుబాబు  "కాలేజి మేగ్ జైన్ కు స్టూడెంటు ఎడిటర్ని. రచన ఏమైనా ఇవ్వరూ?" అని అడిగాడు.

"కష్టం. తీరికలేదు. ఇటు విమర్శలూ, అటు కావ్యపరంపరలు తలమునిగి ఉన్నాను. ఐనా ప్రయత్నిస్తాను. కొన్నాళ్ళు పోయాక కనిపించు. ద్రౌపది మీద ఓ వ్యాసం రాస్తాను."

"మరి వస్తాను. సెలవండీ" అన్నాడు మధుబాబు లేచి నిల్చుని.

"పోయిరా" అన్నాడు మహాకవి.

అతను బయటకు వచ్చేశాడు.

కాలేజీలో తెలుగు అధ్యాపకులందరి దృష్టినీ మధుబాబు ఆకర్షించాడు. వాళ్ళలో ప్రతివొక్కరూ భారతిలో రాయటానికి ప్రయత్నించిన వాళ్ళే. ఒకాయనవి మట్టుకు నాలుగయిదు విమర్శలు ప్రచురించబడినాయి. మిగతావాళ్ళకు అది గగన కుసుమం అయింది. మరీ గట్టిగా ప్రయత్నించగా ఒకటి రెండు కలగూర గంపలో వేసుకున్నారు.

ఒక రోజు మధుబాబు వాళ్ళ స్టాఫ్‌రూమ్ మీదుగా పోతుండగా "ఇలా ఓ సారి రా నాయనా" అని లోపలకు పిలిచారు.

అతను లోపలకు వెళ్ళి "ఎందుకండీ" అన్నాడు.

"భారతిలో కథలు రాసింది నువ్వేకదూ!"

అతనికి అర్ధమైంది. "అవునండి" అన్నాడు నెమ్మదిగా.

అవధానిగారు గట్టిగా పొడుం పీల్చి "ఎలా వేసుకుంటున్నారోయి నీవి?" అని అడిగాడు.

అతనికి యీ మాటలకు కష్టం వేసింది. జవాబు చెప్పకుండా వూరుకున్నాడు.

ఈ ధోరణి మధుబాబుకి నచ్చలేదు "మొన్న కథ పదిహేను రోజులలో వేసుకున్నారు" అని చెప్పాడు, చెప్పాలని లేకపోయినా.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments